పోలీస్ సిబ్బంది క్వార్టర్స్‌కు మరమ్మతులు

- పిల్లలు ఆడుకోవడానికి పార్క్ ఏర్పాటు
- నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్


పోలీస్ సిబ్బంది క్వార్టర్స్ పరిసరాలు పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్, తదితరులు

అల్లిపురం: పోలీస్ సిబ్బంది క్వార్టర్స్‌కు మరమ్మతులు జరిపి, పిల్లలు ఆడుకునేందుకు పార్కు, ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అల్లిపురం పోలీస్ క్వార్టర్స్‌తోపాటు, కొత్తగా నిర్మిస్తున్న కాన్ఫరెన్స్ హాల్, ఇతర భవనాలను పరిశీలించారు. ఆఫీసర్స్ క్లబ్‌ను సందర్శించిన ఆయన వసతి గదులు, పరిసరాలు పరిశీలించారు. ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి గదికి ఏసీ సదుపాయం కల్పించాలని, కొత్తగా మూడు వసతి గదులు నిర్మించాలని, ఆఫీసర్స్ క్లబ్ మొత్తం పెయింటింగ్ వేయించాలని ఆదేశించారు. అల్లిపురం పోలీస్ క్వార్టర్స్‌లో నాలుగో అంతస్తులో గల గృహాలకు సీలింగ్‌లకు మరమ్మతులు తక్షణమే చేపట్టాలన్నారు. అర్మ్‌డ్ రిజర్వ్ భవనం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కాన్ఫరెన్స్ హాల్‌ను సందర్శించిన ఆయన టాయిలెట్స్ నిర్మాణానికి కావాల్సిన ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఆయనవెంట అడ్మిన్ ఏడీసీపీ, అర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన


ర్యాలీలో పాల్గొన్న ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అల్లిపురం: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంజీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీఎస్ఎన్ నాగభూషణం సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అల్లిపురం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ ఎంజీఎం హైస్కూల్ వద్ద ప్రారంభమై నీలమ్మవేపచెట్టు రోడ్డు, బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట మీదుగా తిరిగి పాఠశాలకు చేరుకుంది. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాల్లో సాహిత్యానికి సంబంధించినవి, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతో పాటు దినపత్రికలు ఉంటాయని తెలిపారు. బాలల సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను చదవడం వల్ల విద్యార్థులకు చక్కని భాష, విజ్ఞానం సొంతమవుతాయన్నారు. కార్యక్రమంలో పీటీ రవికుమార్, పాఠశాల సిబ్బంది, అల్లిపురం శాఖా గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పక్కాగా ఓటర్లకు నోటీసు ప్రక్రియ


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

అల్లిపురం: ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ సిబ్బందిని ఆదేశించారు. అల్లిపురం, వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా.. జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్న నోటీసులను పరిశీలించారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో పారదర్శక విధానం పాటించాలని ఆదేశించారు. ఓటరు అనుమతి తీసుకున్నాకే ఓటును తొలగించాలని స్పష్టం చేశారు. సంబంధిత సచివాలయ పరిధిలోని ఓటర్ల జాబితాను ఆయన పరిశీలించారు. ఓటర్లు, పోలింగ్ బూత్‌ల నిష్పత్తి గురించి అడిగి తెలుసుకున్నారు. నోటీసుల ప్రక్రియను పక్కాగా నిర్వహించాలన్నారు. కాలపరిమితిని అనుసరించిన తరువాత చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులు తనిఖీ చేసి సూచనలిచ్చారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అడ్డంకులు తొలగించాలని వినతి

మహారాణిపేట: బార్ ఏర్పాటు చేయడానికి కొంత మంది ఇబ్బందులు పెడుతున్నారని, వారు అడ్డంకులు పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. జీవీఎంసీ 37వ వార్డు రెల్లివీధి కమర్షియల్ ఏరియాలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్ జారీ చేసిందని, కానీ కొంత మంది అడ్డుకుంటున్నారని వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, మత్స్యకార సంఘం గౌరవ అధ్యక్షుడు పెంటయ్య, కార్యదర్శి చింతపల్లి అయ్యప్పరాజు అన్నారు. దీనిపై ఇప్పటికే వన్‌టౌన్ పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. గత నెల 29న ఎక్సైజ్ శాఖ రెల్లివీధిలో బార్ అండ్ రెస్టారెంటు ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందని, దీని నిమిత్తం రూ.76 లక్షల లైసెన్స్ ఫీజు కోసం చెల్లించారని జయకుమార్, పోతుస్వామి తెలిపారు.

స్టీల్‌క్లబ్ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల స్వీకరణ

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 స్టీల్‌క్లబ్ పాలకవర్గం ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. అన్ని పోస్టులకు అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఈ నెల 26న జరగనున్న పాలకవర్గం ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్లు స్వీకరించారు. ఎన్నికల అధికారి జే.వి.రావు నేతృత్వంలో జరిగిన ప్రక్రియలో కార్యదర్శి పోస్టులకు పెంటకోట రామకృష్ణ, ఎస్.వీరాస్వామి, ఎస్.ఎల్.ఎన్.రావు, ఎస్.వి.సత్యనారాయణ నామినేషన్లు దాఖలు చేశారు. సంయుక్త కార్యదర్శి పోస్టుకు కోన సత్యనారాయణ, డి.వేణుగోపాల్, జి.సురేష్, కర్రి సుమాంజలి పోటీలో ఉన్నారు. కోశాధికారి పోస్టుకు ఆర్.సత్యనారాయణ, కుంచె సత్యనారాయణ నామినేషన్లు వేశారు. గ్రూప్-1కు చెందిన రెండు పోస్టులకు ముగ్గురు అభ్యర్థులు బి.వి.రమణ, వై.రవికుమార్, డి.ఉమామహేష్ నామినేషన్లు దాఖలు చేశారు. గ్రూప్-2లోని ఐదు పోస్టులకు 8 మంది అభ్యర్థులు కె.ఎల్.నరసింహం, ఎం.కృష్ణయ్య, బి.చిట్టిబాబు, పి.పరమేశ్వరరెడ్డి, ఎ.శివశంకర రెడ్డి, ఎ.శ్రీనివాస వర్మ, వి.అప్పలరాజు, వి.ఎస్.బి.రాజు నామినేషన్లు వేశారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంచినట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు ఎటువంటి అపరాధ రుసుమ లేకుండా తగిన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.200ల ఫైన్‌తో ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సమీపంలోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

ఆపన్నులకు అండగా ఎమ్మెల్యే వాసుపల్లి

- పది మందికి రూ.50వేలు ఆర్థిక సాయం

డాబాగార్డెన్స్: ప్రజాదర్బార్‌లో వైద్య సహాయం కోసం వచ్చిన అర్జీలపై స్పందించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బాధితులకు అండగా నిలిచారు. తన సొంత నిధుల నుంచి పది మందికి రూ.50వేలు అందజేశారు. 39వ వార్డు వాడవీధికి చెందిన క్యాన్సర్ బాధితురాలు కట్ట అప్పలనర్సమ్మకు, అగ్నిప్రమాదంలో గాయాలపాలైన కురుపాం మార్కెట్ ఏరియావాసి పెదగాడ శ్రీనివాసరావుకు, డెంగ్యూతో బాధపడుతున్న చావలవారి వీధికి చెందిన ఇలాంకి అనూషకు మందుల కొనుగోలు నిమిత్తం రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. 30వ వార్డు కొత్త జాలారిపేటకు చెందిన బెహరా సరస్వతి భర్త రాంబాబు అనారోగ్యంతో మృతి చెందడంతో పెద్దకర్మ కోసం రూ.5వేలు అందజేశారు. 30వ వార్డు అఫీషియల్ కాలనీకి చెందిన చుత్తురు రంగకు, 29వ వార్డు అంగటిదిబ్బకు చెందిన వలంటీర్ తండ్రి కోరాడ అప్పారావుకు, అదే ప్రాంతానికి చెందిన మాలంపక కృష్ణకు, 30వ వార్డు తాడివీధికి చెందిన దొడ్డి సూర్యకాంతానికి, 33వ వార్డు అల్లిపురం వెంకటేశ్వరమెట్టకు చెందిన గంగి సూరమ్మకు, 33వ వార్డు కొల్లి వీధిలో నివాసముంటున్న కందిపల్లి ముసలయ్యకు మందుల కొనుగోలు నిమిత్తం 5 వేలు చొప్పున అందజేసి, ఆదుకున్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు, పలు వార్డుల అధ్యక్షులు, జేసీఎస్ ప్రెసిడెంట్లు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆయా వార్డుల నాయకులు ఉన్నారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

డాబాగార్డెన్స్: ఏపీఈపీడీసీఎల్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలంటూ ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో తలపెట్టిన మహాధర్నాలో పాల్గొనాలని సిటూ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. జగదాంబ జంక్షన్ సిటూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 25 ఏళ్లుగా ఇంటింటికీ వెళ్లి రీడింగులు తీసి ఏపీఈపీడీసీఎల్‌కు ఆదాయం రప్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు రామకృష్ణ, క్రాంతికుమార్, గుప్తా, పోలారావు, శ్రీనివాస్, వెంకటరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'ఆపాత మధురాలు'


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఫణిస్వామి తదితరులు

డాబాగార్డెన్స్: స్థానిక ప్రేమసమాజం ఆడిటోరియంలో 'మధురం మధురం ఈ సమయం' పేరిట శనివారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఎన్ఆర్ఐ నూకల ప్రభాకర్ నిర్వహణలో స్వర తరంగిణి సంస్థ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆధ్యాత్మికవేత్త ఫణిస్వామి, సామాజిక విశ్లేషకుడు సన్‌మూర్తి, గంటి నాగేశ్వరరావు, సుబ్బలక్ష్మి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నూకల రామనరసింహం, ప్రభాకర్, పెమ్మిరాజు రామ్, సీవీ రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, అమ్ము సత్యవతి తదితరులు ఆపాత మధురాలను ఆలపించి, ఆకట్టుకున్నారు. వ్యాఖ్యాతగా గాయకుడు ఎంవీఆర్ నాగేశ్వరరావు వ్యవహరించగా, చింతా ప్రభాకర్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దీక్షధారులకు భిక్ష ప్రారంభం


పూజలందుకుంటున్న గౌరీ పరమేశ్వరులు


భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప దీక్షధారులు

అల్లిపురం: వెంకటేశ్వర మెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వాములకు, భవానీలకు శనివారం అన్న సమారాధన ప్రారంభించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి శ్రీను, కార్యదర్శి శరగడం మోహన్‌రావు, మాజీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్ ప్రారంభించారు. గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి శ్రీను మాట్లాడుతూ 76 సంవత్సరాలుగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు నిరంతరాయంగా జరుపుతున్నామని తెలిపారు. డిసెంబర్ 9వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్తీక పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం కార్యవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో అల్లిపురం వాసులు పాల్గొన్నారు.


గౌరీ పరమేశ్వరులకు పూజలు


గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో బొడ్డేటి ప్రసాద్ తదితరులు

అల్లిపురం: రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేటి ప్రసాద్, కేంద్ర గౌరీ సంఘం, మాజీ కార్యదర్శి కొణతాల సూర్యనారాయణ శనివారం సాయంత్రం వెంకటేశ్వరమెట్టపై పూజలందుకుంటున్న శ్రీ గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. వారికి గ్రంథాలయం ప్రతినిధులు భీశెట్టి శ్రీను, శరగడం మోహన్, యల్లపు గోపాలరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం స్వాగతం పలికారు. వారు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

- బల్లిగిరి వేంకటేశ్వరస్వామిని బొడ్డేటి ప్రసాద్, కొణతాల సూర్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బల్లిగిరి వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో సహస్ర నామ పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి విశేష హారతులు, దీపారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

23న ఏకాదశి ప్రత్యేక పూజలు

ఈ నెల 23వ తేదీన కార్తీక ఏకాదశి సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు తెలిపారు. ఆ రోజు తెల్లవారుజాము నుంచి స్వామివారికి విశేష పూజలు ఉంటాయన్నారు.

'మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చండి'


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎల్లాజీ

డాబాగార్డెన్స్: ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20, 21న బీచ్‌రోడ్డులో పలు సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లిపల్లి ఎల్లాజీ తెలిపారు. ఈ మేరకు శనివారం సంఘ కార్యాలయం వద్ద మాట్లాడారు. మత్స్యకారులు బాగా వెనుకబడిన దృష్ట్యా ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. తుఫాన్లు సంభవించే సమయంలో ఫిషింగ్ బోటర్లు ఎన్నోసార్లు ప్రమాదాలకు గురై నడి సముద్రంలో మునిగిపోయిన సందర్భాలున్నాయని, కొన్ని ప్రాంతాల్లో మినీ జెట్టీలు ఏర్పాటు చేయాలని కోరారు. చేపల వేట నిషేధ సమయంలో రూ.20 వేలు, సబ్సిడీపై డీజిల్ ఇవ్వాలని కోరారు. మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని 20న ఉదయం 10 గంటలకు ఆంధ్రా కవాలీ పోటీ నిర్వహించనున్నట్లు చెప్పారు. 21న ఉదయం 10 గంటలకు మత్స్యకారుల ఆచార సంప్రదాయాలు ప్రతిబింబించేలా జాలారి బాగోతం అనే నృత్యరూపకం, చిడతలు, తప్పెటగుళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం రేలారే రేలా మురళీ, కోలాటం, బాలికలచే భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఉంటాయన్నారు. సాయంత్రం నిర్వహించనున్న కార్యక్రమంలో 2 వేల మంది మత్స్యకారులకు చీరలు, వెయ్యి మందికి దుప్పట్లు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, భీమునిపట్నం ఎంపీపీ దంతులూరి వాసురాజు, విశాఖ ఫిషింగ్ హార్బర్ సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్, మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు అందజేయనున్నట్టు చెప్పారు.

సిస్టర్ ఆలిస్ మేరీ అస్తమయం


సిస్టర్ ఆలిస్ మేరీ (ఫైల్)

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆలిస్ మేరీ(86) శనివారం తుది శ్వాస విడిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. దాదాపు 60 సంవత్సరాల క్రితం ఫ్రాన్స్ నుంచి భారతదేశం వచ్చిన ఆమె, విశాఖ సెయింట్ జోసెఫ్ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా చేరారు. అనంతరం ప్రధానాచార్యులుగా, కరస్పాండెంట్‌గా, పరీక్షల నియంత్రణ అధికారిగా సేవలందించారు.

జెడ్పీ సమావేశాల్లో గిరిజనుల సమస్యలపై చర్చించాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

సీతమ్మధార : జిల్లా పరిషత్ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చించాలని కోరుతూ పీవీటీజీ ఆదివాసి కోందు తెగకు చెందిన గిరిజనలు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద డోలి, కాగడాలు చేతపట్టి, అడ్డాకులు నెత్తిపై టోపీలుగా పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం, షెడ్యూల్ సాధన సమితి గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు మాట్లాడుతూ అనంతగిరి మండలం, రొంపల్లి పంచాయతీ బూరుగ, చిన్నకోనిల గ్రామాల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం లేక రెండు వేల మంది జనాభా చీకట్లో మగ్గుతున్నారన్నారు. మా గ్రామాలకు కరెంట్ సౌకర్యం కల్పించాలని కోరారు. నూతనంగా రెండు స్కూళ్లు ఏర్పాటు చేశారని, ఇప్పటి వరకు స్కూల్ టీచర్లు రావడం లేదన్నారు. వర్షాలకు రోడ్లన్నీ కొట్టుకుపోవడంతో గర్భిణులను డోలీతో మోసుకొని వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. బూరుగ, చిన్నకోనిల గ్రామాల్లోని మా భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై, వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో మార్పులు చేసి బ్యాంకు రుణాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్ స్వయంగా విచారణ చేపట్టి స్థానిక రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మర్రి వెంకటరావు, ఎస్.అప్పలరాజు, కిల్లో మహేష్, కోనేపర్రి సింహాచలం, గిరిజన గ్రామ యువకులు పాల్గొన్నారు.

డీఈఐసీలో ఘనంగా బాలల దినోత్సవం


మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సమత

మహారాణిపేట: కేజీహెచ్ డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ)లో శనివారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సమత నేతృత్వంలో ప్రత్యేకావసరాలు గల చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సమత మాట్లాడుతూ కేంద్రంలో అంగవైకల్యం, మానసిక సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే సహకారంతో కౌన్సెలింగ్, ఫిజియోథెరపీ తదితర వైద్యసేవలను అందిస్తున్నట్లు తెలిపారు. మాటలు రాని చిన్నారులకు, మాట స్పష్టత లేని చిన్నారులకు స్పీచ్ థెరపీ ఇస్తున్నట్లు తెలియజేశారు. వినికిడి సమస్య ఉన్నవారికి వినికిడి పరికరాలు, కంటి సమస్య ఉన్న వారికి కళ్లజోళ్లు అందించామన్నారు. గుండె సమస్య ఉన్నవారికి శస్త్రచికిత్స వంటి ఎన్నో సేవలను డీఈఐసీ ద్వారా చేస్తున్నట్లు వివరించారు.

శ్రీవారి దర్శనానికి భారీగా భక్తులు

కొమ్మాది: కార్తీకమాసం, శ్రీవారికి ప్రీతికరమైన శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి తరలివచ్చారు. ఉదయం తోమాల సేవ, సుప్రభాత సేవ అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు. సాయంత్రం అన్నమయ్య కీర్తనలు, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

అద్భుతం.. నృత్యరూపకం


నాట్య విన్యాసం

మద్దిలపాలెం: ఆకాశ గంగను ధరిణిలోకి రప్పించడంలో భగీరథుడు ప్రయత్నం ఎలా ఫలించిందనే అపురూప నాట్య రూపకాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. కళా సరిత్సాంగరంస గ్రంథ కర్త అయిల సోమయాజులు జోగారావు కలం నుంచి జాలువారిన భగీరథ విలాసం నృత్యనాటకానికి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి 23వ వార్షికోత్సవం సందర్భంగా ప్రదర్శించారు. వీఎండీఏ వార్షికోత్సవ సంబరాలను ఆదాయ పన్నుల శాఖ మాజీ కమిషనర్ సూదగాని రవిశంకర్ నారాయణ్ ప్రారంభించారు. కూచిపూడి డ్యాన్స్ గురువు కేవీ లక్ష్మి నిర్దేశకత్వంలో జరిగిన ఈ వేడుకల్లో తొలి ప్రదర్శనగా ప్రముఖ కూచిపూడి నాట్యకళాకారిణి సూదాగాని గీతానారాయణ్ శివరంజని రాగంలో మహేశ్వరి మహాకాళి నృత్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా కేవీ లక్ష్మి మాట్లాడుతూ వీఎండీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన విక్రమ్ గౌడ్ పాత్ర అనితర సాధ్యమని కొనియాడారు. బి.సత్యనారాయణ, మనోజ్‌కుమార్, రమణమూర్తి పాల్గొన్నారు.

జీపీఎఫ్ రుణాలు సకాలంలో మంజూరు చేయాలి

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు జీపీఎఫ్ లోన్లు సకాలంలో మంజూరు చేసేలా తగిన చొరవ తీసుకోవాలని జెడ్పీ సీఈవో పోలినాయుడుకు పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ గోపీనాథ్ కోరారు. శనివారం జెడ్పీ సీఈవోను కలసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఇటీవల కాలంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో జీపీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలన్నారు. సాంకేతిక సమస్యలతో కొంతమంది ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో వేతనాల నుంచి మినహాయించిన డబ్బులు జమ కావటం లేదన్నారు. దీనిపై చొరవ తీసుకొని ఉపాధ్యాయులకు మేలు చేసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు.అదే విధంగా పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే పరమావధి


మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న చింతలపాటి సత్యదేవ్ తదితరులు

తాటిచెట్లపాలెం: నిస్వార్థంగా సమాజానికి సేవ చేయడమే జగద్గురు పీఠం(ది వరల్డ్ టీచర్ ట్రస్ట్) పరమావధని సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.శాస్త్రి అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో శనివారం నిర్వహించిన సంస్థ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన అధ్యక్షుడిగా పాల్గొని మాట్లాడారు. అక్కయ్యపాలెంలోని మాస్టర్ హోమియో వైద్యాలయంలో 40 ఏళ్లుగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బెంగుళూరు ట్రస్ట్ ప్రాంతీయ గణపతి రామ్‌ప్రసాద్ జోషి మాట్లాడుతూ మాస్టర్ ఈకే ప్రబోధించిన ఆజన్మదీక్ష సేవ, సమన్వయాత్మక యోగ జీవనానికి ఆకర్షితుడనై.. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ బెంగళూరు తపోవనం, మైసూర్‌లో ఆనందవనం అనే యోగా బృందాల ద్వారా సేవలందిస్తున్నామన్నారు. సంస్థ డైరెక్టర్ చింతపాటి సత్యదేవ్ మాట్లాడుతూ సామాన్యులకు సేవలందించాలనే మాస్టర్ ఈకే సిద్ధాంతానికి ప్రత్యక్ష నిదర్శనమే సంస్కృతి సదన్ అని పేర్కొన్నారు. ముందుగా మాస్టర్ ఈకే దంపతుల చిత్రపటానికి పూలమాల సమర్పించారు. పలు వృత్తి విద్యల్లో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు సర్టిఫికెట్లు, 18 మందికి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేశారు. బాలవికాస్ చిన్నారులకు సదన్ నిర్వాహకులు దాట్ల రాధ, బి.ఉషారాణి దుస్తులను బహూకరించారు. అనంతరం విష్ణుసూక్తం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డి.వి.భాస్కరరావు, హోమియో వైద్యులు డాక్టర్ జి.ఎ.రామేశ్వర్, డాక్టర్ బి.వంశీకృష్ణ, ఆయా కేంద్రాలకు చెందిన ట్రస్ట్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్‌కు పతకాల పంట

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌కు పతకాల పంట పండింది. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-101 వార్షిక సమావేశం శనివారం ఎంవీపీ కాలనీలో నిర్వహించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఉత్తమ సేవలకు ప్రథమ బహుమతి, ఉత్తమ అధ్యక్షుడిగా పల్లా చంద్రమౌళి, ఉత్తమ కార్యదర్శిగా ఎల్‌వీ సుధాకర్, ఉత్తమ బులిటెన్ ఎడిటర్‌గా నిమ్మగడ్డ బుచ్చయ్య, ప్రత్యేక ప్రశంసా బహుమతి కోశాధికారి జె.కూర్మారావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావులకు ప్రకటించారు. ఆరు బహుమతులు ఒకే క్లబ్‌కు రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం. వీరికి వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర, డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అవార్డులు అందించారు. శనివారం సాయంత్రం వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అవార్డు గ్రహీతలను వాకర్స్ క్లబ్ పూర్వాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు అభినందించారు.